


# పరదేశీ కథలు

- చిట్టే సిద్ధ లలిత



- 105 -

## ఎడారి సూర్యుడు

**పొద్దు పడమటికి వాలిపోతోంది**. నవంబర్ నెల కావడంతో వాతావరణం కాస్త చల్లబడింది. ఎడారి నుండి వీచే పిల్లగాలులు చల్లగా తాకి గిలిగింతలు పెడుతున్నాయ్. ఎటు చూసినా ఇసుక బంగారు వర్ణంలో మెరుస్తూ కళ్ళకు కనబడుతోంది. అక్కడక్కడా మేటలు వేసి ఎత్తైన దిబ్బలుగా మారిన ఇసుక గాలి వీచినప్పుడల్లా తెరలుగా పైకి లేచి వాలుకు కొట్టుకుపోతోంది. గడ్డి లేకపోవడంతో ఒంటెలు చుట్టూ తిరిగి అక్కడక్కడా మొలిచిన తుప్పలను కొరికి తింటున్నాయి.

పదిరోజులయింది సేటు వచ్చి. నాల్రోజులకు ఒకసారి వచ్చి ఒంటెలకు గడ్డి, సూరికి రొట్టెలు ఇచ్చిపోతాడు.ఈసారి ఇంకా రాలేదు. రొట్టెలు ఎప్పుడో అయిపోయాయి. ఒంటెలకు గడ్డి కూడా అయిపోయింది. అందుకే మేతకు బయటికి తీసుకొచ్చాడు. కానీ ఎడారిలో తినడానికి ఏముంటుంది. రెండు రోజుల్నుండీ వున్న నీళ్ళు తాగి కడుపు నింపుకుంటున్నాడు సూరి.

పొద్దు వాలిపోయి చీకట్లు అలముకుంటున్నాయి. ఇంక ఈ రోజుకు సేటు రాడు. రేపయినా వస్తాడో రాడో ఎవరికి తెలుసు. రాకపోతే పరిస్థితి ఏంటి..? ఇప్పటికే శోష వచ్చి పడిపోయేలా వుంది ప్రాణం. ఉస్సురని నిట్టూర్చాడు సూరి. ఊరు, అమ్మ, నాయన గుర్తొచ్చారు. కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

డ్రైవర్ గా ఉద్యోగం చేసి లక్షలు సంపాదించాలని కొయేటికి వస్తే ఈ ఎడారిలో ఒంటరిగా ఒంటెలు మేపుకునే ఖర్మ పట్టింది. కువైట్ మీద మోజుతో ఇక్కడ జీవితం సుఖంగా వుంటుందని పరిగెత్తుకుని వచ్చాడు. అనుకున్నదొక్కటి జరిగింది మరొక్కటి. తోడుగా ఒంటెలు ఈ ఎడారి మిగిలాయి. ఇక్కడ ఎంత దూరం వెతికినా నరమానవుడు అనేవాడు ఎక్కడా కనిపించడు. సేటు నాల్రోజులకు ఒకసారి కారేసుకుని వస్తాడు. నెలకు ఠంచనుగా జీతం ఇస్తాడు. అంతే.

ఒక్కోసారి సేటుతో పాటూ డ్రైవర్ సలీం వస్తుంటాడు సామాన్లు మోయడానికి. అప్పుడు అతనికి జాబు, డబ్బు ఇచ్చి ఇండియాలోని నాయనకు పంపించమని చెప్తాడు. అంతకుమించి మానవునితో మాటలు లేవు, ఒంటెలతోతప్ప. వచ్చి సంవత్సరమయింది. ఇంటి కాడ్నుంచి ఒక జాబు కూడా రాలేదు. ఎలా వున్నారో క్షేమ సమాచారం కూడా తెలియలేదు. అదో దిగులు. ఇంతే తన బ్రతుకింతే. రెండేళ్ళ కాంట్రాక్ట్ పూర్తి చేయాలి తప్పదు అనుకుని మనసును రాయి చేసుకుని బ్రతుకుతున్నాడు సూరి.

ఇంతకీ సేటు ఎందుకు రాలేదో? ఏమయిందో? ఆరోగ్యం బాలేదా? వేరే దేశమెళ్ళాడా? తన సంగతి మర్చిపోయాడా. అన్నీ సందేహాలే.

గత్యంతరం లేదు. సేటు రేపు రాకపోతే ఇక్కడ్నుంచి వెళ్ళిపోయి ప్రాణాలను కాపాడుకోవడమే. ఇంతకీ ఏ దిశగా వెళితే కువైట్ సిటీ వస్తుందో. కనుచూపు మేర దారేదీ కనబడటంలేదు.

అంతా ఎటు చూసినా అంతులేని ఎడారి కనబడుతోంది. దారి తెలియకపోతే ఎడారిలో చిక్కిపోయి దిక్కులేని చావు చస్తాడు. కాబట్టి జాగ్రత్తగా పట్టణం వున్న దిశగా ప్రయాణించాలి. ఇక తప్పదు. రేపు ఉదయాన్నే ఈ ప్రదేశాన్ని వదిలిపెట్టి చావో బ్రతుకో తేల్చుకోవాలి.

మరి ఒంటెలో? పాపం వాటినేం చేయాలి. తిండి నీళ్ళు లేక మాడి అవి చనిపోతాయేమో. ముద్దుగా వున్న ఒంటె పిల్లల మీద చెయ్యి వేసి మెడ నిమిరాడు. అలవాటయిన సూరి దగ్గర గారాలు పోయాయి అవి. వీటినేం చెయ్యాలి అని ఆలోచిస్తూ దిగులుగా ఒంటెలనన్నిటినీ షెడ్డు లోపలికి తోలి గేటు వేసాడు.

అవి కూడా ఆహారం లేక బక్క చిక్కిపోయాయి.సేటు ఒంటెల వ్యాపారం చేస్తాడు.

దాదాపూ 150 ఒంటెలు వున్నాయి. వీటికి కాపలాగా సూరిని పెట్టి నెలకు నలభై దినార్లు జీతం ఇస్తున్నాడు.

సూరికి కూడా ఒక రేకుల షెడ్డు వుంది. అందులో మంచం, కంచం, రెండు టీ కప్పులు, టీ కాచుకొని రొట్టెలు వేడి చేసుకోవడానికి ఒక స్టవ్వు, ఒక బల్ల వున్నాయి. ఇక పక్కనే వున్న ప్లేస్ లో ఒక రేకు అడ్డు పెట్టి అది బాత్ రూముగా ఉపయోగిస్తున్నాడు. నీళ్ళు కూడా ఒక డ్రమ్ము నిండా సేటు తీసుకొస్తాడు. నాల్రోజులకు మరలా సేటు వచ్చేదాకా, తెచ్చేదాకా అన్నిటికీ అవే సరిపెట్టుకోవాలి.

ఉదయాన్నే లేవగానే ఒంటెల దగ్గరికి వెళ్ళాడు. మేత ఎప్పుడో అయిపోయింది. ఇప్పుడు నీళ్ళు కూడా లేవు. ఒంటె ఎడారి జీవి కాబట్టి కొన్ని రోజులు బతక గలదు.

తన పరిస్థితి ఏమిటి? నీళ్ళు కూడా లేకుండా ఎన్ని రోజులు వుండగలడు. ఎండిపోతున్న పెదాలను ఒకసారి నాలుకతో తడుపుకున్నాడు సూరి.

ఏదయితే అదయింది ఒంటెలను కూడా తనవెంట తోలుకుని పోవాలని నిశ్చయించుకున్నాడు.

ఇంకో రెండు గంటలు సేటు కోసం చూసి ఆయన వచ్చే దారికి ఎదురుపడి పోవాలని అనుకున్నాడు.

ఆకాశంలో సూర్యుడు బిరబిరా పైకి వచ్చాడు. ఎండ తీక్షణంగా వుంది. ఎడారి నేల నిముషంలో వేడెక్కింది.

తాళలేని వేడిని చల్లార్చుకునేందుకు నీళ్ళు లేవు. అడ్డుగా వున్న దడిని తెరిచాడు.

ఒంటెలు బయటికి వచ్చాయి. వాటిని ఓ వైపుగా తోలుతూ ముందుకు సాగాడు. దాదాపు ఐదు కిలోమీటర్లు నడిచి వుంటాడు.

కణకణలాడే అగ్నిగుండంలా అగుపిస్తోంది ఎడారి.

శరీరం సత్తువ కోల్పోయింది.

కింద కూలబడాలనిపిస్తుంటే తమాయించుకుంటూ ఎక్కడైనా జనవాసం కనిపిస్తుందని కళ్ళు చిట్లించి ఆశగా ముందుకు చూస్తున్నాడు సూరి. ఒంటెలు బారుగా ముందుకు సాగిపోతున్నాయి. దస్సిపోయాడు సూరి.

పైనున్న సూర్యుడి కిరణాలకు తట్టుకోలేక కళ్ళు బైర్లు కమ్మాయి.

ఒక్క క్షణం అమ్మ నాయన గుర్తొచ్చారు. ఒంటెలను నిలవరించే శక్తి కూడా లేక నిస్త్రాణగా ఇసుకలో కూలబడిపోయాడు సూరి.

ఎవరో పిలుస్తుంటే భారంగా కళ్ళు తెరిచి చూసాడు సూరి. ఎదురుగా పరిచయం లేని వ్యక్తి ఎవరో నవ్వుతూ ముఖంలోకి చూస్తున్నాడు. అదొక రేకుల షెడ్డు. అచ్చం తన షెడ్డులాగే వుంది. కానీ నిండా సామాన్లతో సమృద్ధిగా వుంది.

శ్రీలంక వాడనుకుంటా.. నల్లగా స్ఫోటకం మచ్చలతో భయంకరంగా వున్నాడు.

"ఎలా వుంది మిత్రమా" అని అరబ్బీలో అడుగుతున్నాడు.

నీరసంగా నవ్వాడు సూరి.

"ఇదిగో రొట్టెలు వేడి చేసాను. తిను" అన్నాడు.

అతని ఆప్యాయతకు ఏడుపొచ్చింది. అతను రక్షించకపోతే తను ఎడారిలో చచ్చిపోయేవాడు. ఇసుక గుట్టల కింద శాశ్వత సమాధి అయ్యేవాడు. ఇంకా భూమి మీద ఎవరికో ఏదో తీర్చే రుణం వున్నట్లుంది. చిన్నగా లేచి కూర్చున్నాడు. అతడు చేయి పట్టి పైకి లేపి మొహం కడుక్కోమన్నాడు.ముఖమంతా ఇసుక అతుక్కొని వుంది. బట్టలు మట్టికొట్టుకు పోయాయి.

"నిన్నటినుండీ స్పృహలో లేవు మిత్రమా. నా దగ్గర వున్న జూసులు తాగించి నిన్ను బతికించాను" అన్నాడు.

చేతులు జోడించి నమస్కరించాలి అనిపించింది కానీ శక్తి సరిపోలేదు. ఒక రొట్టె తిని వేడి టీ తాగాక కాస్త ఓపిక వచ్చింది.

"నా ఒంటెలు ఎక్కడ?" తేరి పార చూసాడు.

"నలభై రెండు ఒంటెలు వున్నాయి మిత్రమా. నా ఒంటెలతో పాటూ వాటికీ మేత వేసాను" అన్నాడు.

"నలభై రెండేనా.. మిగతా 108 ఎక్కడికి పోయాయో?" కలవరపడ్డాడు సూరి.

"బాధ పడకు. అవి ఎడారిలోకి పరిగెత్తి వుంటాయి మిత్రమా" అన్నాడు ఓదార్పుగా.

"సేటు ఏమంటాడో" భయంగా చూసాడు సూరి.

"సరే నువ్వు కాసేపు స్థిమితంగా విశ్రాంతి తీసుకో కుదుటపడతావు తరువాత వెతుకుదాం" చెప్పాడు శ్రీలంక అతను.

కళ్ళు మూసుకున్నాడు సూరి. ఆ రోజు గడిచింది. కాస్త తెప్పరిల్లి కుదుట పడ్డాడు సూరి. ఇప్పుడు పోయిన ఒంటెలను వెతకాలి. ఎడారిలో ఎక్కడని వెతకగలడు.

ముందు తాను వున్న ప్రదేశానికి తిరిగి వెళ్ళాలన్నా దారి తెలియదు. ఇప్పుడెలా. ఏంటి కర్తవ్యం. తల పట్టుకున్నాడు సూరి.

పొద్దున్నే బయల్దేరి చుట్టూ చూసి ఒంటెలు కనబడక ఉసూరుమంటూ మధ్యాహ్నం రేకుల షెడ్డు వద్దకు వచ్చాడు సూరి.

సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. అదే సమయంలో రయ్ మంటూ వచ్చి ఆగింది సేటు కారు.

సేటును చూసి ఆనందంగా లేచాడు సూరి.

పెద్ద అంగలతో సూరిని సమీపించిన సేటు "ఏరా దొంగ వెధవా.. పని వుండి నాల్రోజులు రాకపోయేసరికి.. నా కళ్ళు కప్పి ఒంటెలను తోలుకొచ్చి అమ్ముకుంటావా.. ఎంత ధైర్యం నీకు" అంటూ బూటు కాలితో తన్న సాగాడు.

బిత్తరపోయాడు సూరి. జవాబు ఇచ్చే వ్యవధి కూడా ఇవ్వలేదు. మాట వినకుండా చితకబాదాడు సేటు.

గాయాలతో కింద పడిపోయాడు సూరి.

శ్రీలంక అతను పరిగెత్తుకొచ్చి "బాబా 42 ఒంటెలు వున్నాయి మిగతావి పారిపోయాయి" అన్నాడు.

"పారిపోయాయా.. ఇద్దరూ కలిసి అమ్ముకుని సొమ్ము చేసుకుని నాటకాలాడుతున్నారా" అంటూ అతని చెంప మీద కొట్టాడు బాబా.

భయంగా చూసాడతడు.

"నువ్వు వీడికి తోడు దొంగవు కదా" అంటూ వాడిని కూడా రెండు బాదాడు సేటు.
కుయ్యో మొర్రో అంటూ అదికాదు బాబా అని చెపుతున్నా వినలేదు.
"నీ పేరేంటి? మీ బాబా పేరేంటి చెప్పు" హుంకరించాడు సేటు.
"నా పేరు కుమార, మా బాబా పేరు ఖలీల్" అని చెప్పాడు.
ఇంతలో కుమార బాబా అదే సమయానికి రానే వచ్చాడు.
సూరి బాబా అతనికి అరబ్బీలో ఏమి చెప్పాడో ఏమో ఆయన కూడా కోపంతో కర్ర తీసుకుని ఇద్దరినీ చితకబాదాడు.
చచ్చీచెడీ బతికి బట్ట కట్టాను అనుకుంటే మరలా ఈ ఉపద్రవమేంటో అర్థం కాలేదు సూరికి. 108 ఒంటెలు కనబడలేదు అంటే సేటు ఊరుకోడు. ప్రాణం తీయకుండా వదలడు. పైగా ఒంటెలను అమ్మేసాడనే నింద ఒకటి. ఇలాంటి నమ్మక ద్రోహాన్ని వీళ్ళు అసలు సహించరు. అంతు చూస్తారు. ఏం చెయ్యాలిపుడు అనే ఆలోచనలో వుండగానే.. ఇద్దర్నీ ఎండలో నిలబెట్టి తాళ్ళతో షెడ్డుకు కట్టేసి, "ఒంటెలు దొరకకపోతే తిరిగి వచ్చాక మీ పని చెబుతాం" అంటూ కార్లేసుకుని ఒంటెలను వెతకడానికి ఎడారి బాటలో సాగిపోయారు ఇద్దరు సేట్లు.
మధ్యాహ్నం సూర్యుడు కూడా మండిపడుతున్నాడు. ఎడారి ఎండను తట్టుకోవడం కష్టమే.
"మిత్రమా.. నా వలన నీకూ కష్టాలు వచ్చాయి క్షమించు" అన్నాడు సూరి.
"నుదిటి రాత ఎలా వుంటే అలా జరుగుతుంది మిత్రమా.. ఏదీ తప్పించుకోలేము. మనమయితే తప్పు చెయ్యలేదు. ఏం జరుగుతుందో చూద్దాం. పైన దేవుడున్నాడు" అన్నాడు కుమార.
ధగ ధగ మెరిసే ఎండకు శక్తి క్షీణించి పోతోంది. ఒంటెలు దొరకకపోతే సేట్లు తిరిగి వచ్చి ప్రాణం తీసేస్తారు. అది నూటికి నూరుపాళ్ళూ నిజం. ఇక ప్రాణం మీద ఆశ వదులుకోవాల్సిందే. పాపం తన వలన కుమార సమస్యల్లోకి నెట్టబడ్డాడు అనుకుంటూ నిట్టూర్చాడు సూరి.
కాసేపటికి ఎండకు తాళలేక అటూ ఇటూ పెనుగులాడటంతో కుమార కట్లు విడిపోయాయి.
"సూరీ.. సేట్లు తిరిగివస్తే మన ప్రాణాలు తీసి ఈ ఎడారిలో పూడ్చి పెట్టడం ఖాయం. నీ కట్లు విప్పుతాను. ఇద్దరం ఇక్కడ్నుంచి పారిపోదాం" అన్నాడు కుమార. "వద్దు మిత్రమా.. పారిపోయి నేరాన్ని నెత్తిపై వేసుకోవద్దు. మనం నిరపరాధులం. నిరీక్షిద్దాం. దేవుడు కాపాడతాడు చూడు" అన్నాడు సూరి.

ఇంతలో రయ్ మంటూ రెండు కార్లు వచ్చి ఆగాయి. నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ లోనికి వచ్చారు సేట్లు.
"అరె సూరీ.. ఏంటి ఇంకా అలాగే నిలబడి వున్నావా. భలే వాడివే. ఇదిగో జ్యూస్ తాగు. బ్రెడ్ తిను" అంటూ గలగలా నవ్వుతూ కట్లు విప్పాడు సేటు.

అర్థం కాక తెల్లబోయి చూస్తున్న సూరితో..

"ఒంటెలన్నీ మన షెడ్డులో క్షేమంగా వున్నాయి. అవి ఎడారంతా తిరిగి మరలా మన షెడ్డుకే వచ్చాయి. వాటికి మేత, నీళ్ళు పెట్టి వచ్చాను. పద.. ఈ ఒంటెలను కూడా మన షెడ్డుకు పోదాం" అన్నాడు సేటు ఏమీ జరగనట్లు, ఏదీ ఎరగనట్లు.

చల్లటి మలయ మారుతం వంటిని తాకినట్లయింది. ఒంటెలు క్షేమంగా వున్నాయి అనే సంగతి వినగానే సంతోషించాడు సూరి.

మనిషి ప్రాణానికి విలువ ఎంత.. ఇసుక రేణువంత అనుకున్నాడు సూరి తెప్పరిల్లుతూ.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments